క్లుప్తంగా

ఘనంగా ఊరడమ్మ జాతర



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

తాండూరు రూరల్: ఊరడమ్మ జాతర వైభవంగా సాగింది. మూడు రోజులుగా గోనూర్‌లో జరుగుతున్న ఉత్సవాలు ఆఖరిరోజైన బుధవారం గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి



వాలీబాల్ టోర్నీని ప్రారంభించిన సర్పంచ్

దోమ: యువత క్రీడలపై మక్కువ చూపాలని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంటుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. అనంతరం నెట్, వాలీబాల్ అందజేశారు. ఉపసర్పంచ్ గోపాల్ గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదానం

పూడూరు: తిర్మలాపూర్ పంచాయతీ పరిధిలోని రాకంచర్లలో రక్త, అవయవదాన కార్యక్రమం నిర్వహించనున్నామని డీసీసీ కార్యదర్శి పెంటయ్య తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. 500 మందితో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, అవయ, రక్తదానం చేసేవారు ముందుకు రావాలని కోరారు.

కొడంగల్‌లో..

కొడంగల్: ఉదయం 11 గంటలకు పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆనంద్‌కుమార్ లాహోటీ తెలిపారు. శాంతినగర్ కాలనీలోని లాహోటీ రెసిడెన్సిలో కార్యక్రమం ఏర్పాటు చేశామని, జియో లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

కుల్కచర్ల: అభివృద్ధి పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మరికల్ సర్పంచ్ పాండురంగయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చౌడాపూర్ మండలం మరికల్‌లో 10రోజుల క్రితం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిమిత్తం శిలాఫలకం వేయగా.. మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. దీన్ని ఖండిస్తూ సర్పంచ్ మాట్లాడారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సరైందికాదన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. అందుకు కారకులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సిమెంట్ రంగంలో అగ్రగామి

సీసీఐ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ మహన



సమావేశంలో సంస్థ జనరల్ మేనేజర్

తాండూరు రూరల్: సిమెంట్ రంగంలో అగ్రగామి సీసీఐ సిమెంట్ అని సీసీఐ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ మహన అన్నారు. సీసీఐ ఫ్యాక్టరీ 59వ ఫౌండేషన్ డే సెలబ్రేషన్ సందర్భంగా వివిధ విభాగాల హెచ్ఓడీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీసీఐ ఫ్యాక్టరీలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ.. ప్రైవేటుకు దీటుగా సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. నాణ్యతకు మారుపేరు సీసీఐ కర్మాగారం అని కొనియాడారు. రోజుకు 3 వేల మెట్రిక్ టన్నుల సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ అమిత్ రంజన్, కార్మిక సంఘం నాయకులు శరణప్ప, ఇస్మాయిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంటలోనే ఇంటికి పంట

పెద్దేముల్: యంత్రాల ద్వారా రైతులు పండించిన పంటలకు కొత సమస్యలు దూరమవుతున్నాయి. గతంలో కంది పంటను శుద్ధి చేయాలంటే కూలీల ద్వారా కోసి.. మూడు రోజులపాటు ఎండ బెట్టి.. ఆ తరువాత కళ్లం చేసేవారు. ప్రస్తుతం ఆ పని యంత్రాల ద్వారా సులభతరం అవుతోందని చెప్పవచ్చు. యంత్రాలతో గంటలోనే పంట ఇంటికి చేరడం గమనార్హం. సమయపాలనతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరా పొలాన్ని గతంలో శుద్ధి చేయాలంటే రూ.12 వేల వరకు ఖర్చు అయ్యేదని, ప్రస్తుతం ఎకరా కంది పంటను యంత్రాల ద్వారా కోయాలంటే రూ.2500 నుంచి రూ.3 వేల ఖర్చుతో పంట సాయంత్రం వరకు ఇంటికి చేరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గేటు పడితే.. గంట నిరీక్షణ

తాండూరు రూరల్: నారాయణపూర్ రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. తాండూరు నుంచి పాతతాండూరు మీదుగా నారాయణపూర్, వీరిశెట్టిపల్లి, గోనూర్ గ్రామాల ప్రజలు.. ఈ రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగిస్తుండగా.. గేటు పడిన కొద్దిసేపటికే వందలాది వాహనాలు ఇరువైపులా నిలిచిపోతుంటాయి. ఇలా గేటు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని, గంటల కొద్ది సమయం వృథా అవుతుందని, అత్యవసర సమయంలోనూ ఇదే దుస్థితని వాపోతున్నారు. గతంలో తాండూరును సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులకు తమ గోడును వినిపిస్తూ.. వినతిపత్రం అందజేశామని బాధిత గ్రామాల ప్రజలు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్‌బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.



నారాయణపూర్ రైల్వేగేటు వద్ద వాహనదారుల నిరీక్షణ

సీసీ కెమెరాలతో తగ్గిన నేరాలు

- ఆన్‌లైన్ మోసాలతో జర భద్రం
- సీఐ వెంకటేశం

మోమిన్‌పేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గిందని సీఐ వెంకటేశం అన్నారు. మంగళవారం రాత్రి దేవరంపల్లిలో కళాజాత బృందంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతాయని, ఆన్‌లైన్ మోసాలతో జర భద్రంగా ఉండాలని ఆయన చెప్పారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ప్రతి మెసెజ్, లింకులను ఓపెన్ చేయకూడదని, ఓపెన్ చేయడం వలన బ్యాంకులో ఉన్న నగదు మీకు తెలియకుండానే డెబిట్ అయ్యే ప్రమాదం ఉందని వెల్లడించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, తల్లిదండ్రులు తమ బిడ్డలకు వివాహ వయసు వచ్చేంత వరకు వేచి యుండాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాల జోలికి యువత పోవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా పలు వీడియోలు చూపించారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ విజయ్‌ప్రకాష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశం

డబ్బుల్లేక దివాలా తీశాం

- జీపీ నిధులు మళ్లించడం సరికాదు
- సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సర్పంచులు
- అప్పుల్లో కూరుకుపోయామంటూ ఆవేదన

పరిగి: గ్రామాల అభివృద్ధి కోసం వచ్చిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడంతో మరింత ఇబ్బందుల్లో పడ్డామని, అప్పుల్లో కూరుకుపోయామంటూ అధికార పార్టీ సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు మాట్లాడుతూ జీపీలకు ఉన్న డిజిటల్ కీని ఉపయోగించి, కేంద్రం నుంచి వచ్చిన నిధులను తమకే తెలియకుండా వాడుకోవడం ఏమిటని ముక్తకంఠంతో ప్రశ్నించారు. మళ్లించిన నిధులు తిరిగి గ్రామ పంచాయతీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కీని ఇస్తేనే గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి పనులు జరుగుతాయని అధికారులకు తేల్చి చెప్పారు. డబ్బులు లేక దివాలా తీశామని, ఇప్పుడు కంటి వెలుగు పథకం కోసం జీపీ నిధులను ఖర్చు చేయాలని ప్రభుత్వం చెప్పడం సరికాదని చిట్యాల సర్పంచ్ రజిత సభ దృష్టికి తీసుకువచ్చారు. సొంత డబ్బులతో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

జీపీ నిధుల గురించి అన్ని పార్టీల సర్పంచులు చెప్పడంతో ఎంపీపీ అరవింద్‌రావు మాట్లాడుతూ మీ సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, కనెక్షన్ ఇచ్చి ట్యాప్‌లు ఇవ్వక పోవడంతో నీరు వృథాగాపోతుందని, విద్యుత్ సమస్యలు తీవ్రమవుతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని సర్పంచులు తెలపగా.. విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీడీఓ శేషగిరిశర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

షాబాద్: సరస్వతి శిశు మందిరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో సరస్వతి శిశుమందిరం పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పాఠశాల పరిస్థితిని తెలుసుకున్న అవినాశ్‌రెడ్డి పాఠశాల యాజమాన్యం కోరిన వెంటనే విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత షాబాద్ శిశుమందిరం పాఠశాలకు ఉందని గుర్తుచేశారు. మున్ముందు పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందజేస్తానన్నారు. ఇప్పటికే మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రూ.25లక్షల సొంత నిధులతో గిఫ్ట్ ఏ స్మైల్ కింద బెంచీలను అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, శ్రీరాములు, పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నారాయణ, యాదవరెడ్డి, గౌరిశంకర్, యాస మల్లారెడ్డి, రాందేవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

వందశాతం పన్నులు వసూలు చేయాలి

ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్: గ్రామాల్లో ఇంటి, నల్లా పన్నులను వందశాతం వసూలు చేయాలని ఎంపీడీఓ వినయ్‌కుమార్ చెప్పారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో వారంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గ్రామాల్లో గృహ యజమానుల నుంచి ఇంటి పన్నులు, నల్లా పన్ను నిర్దేశించిన గడువులోపు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డులు జారీ చేయాలని, ఈ కార్డులను ఆధార్ సీడింగ్‌పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించి విజయవంతం చేయాలని చెప్పారు. అధికారులందరు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కల్యాణి, ఏపీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె‘ప్రగతి’కి వెలుగు

- పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత
- ఇంటింటా చెత్త సేకరిస్తున్న సిబ్బంది
- పల్లెప్రగతితో మారుతున్న రూపురేఖలు

దౌల్తాబాద్: పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. బాధ్యత కలిగిన పంచాయతీ పెద్దలు, అంకితభావంతో పనిచేసే సిబ్బంది ఉన్న పల్లెల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న నిధులను అధికారులు ప్రణాళిక ప్రకారం సద్వినియోగం చేస్తుండడంతో పల్లెలు మెరుస్తున్నాయి. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, మురుగకాల్వల్లో పూడికతీత, దోమల నివారణ మందు పిచికారీ, ఇంటింటికీ తాగునీరు వంటి పనులు చేస్తుండడంతో మెజార్టీ గ్రామాల్లో అపరిశుభ్రత దరిదాపుల్లో లేనట్లయింది.

సేంద్రియ ఎరువుగా..

మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా.. ఇందులో సగానికిపైగా చిన్న పంచాయతీలే. పల్లెప్రగతిలో భాగంగా ప్రభుత్వం పంచాయతీకో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ సమకూర్చింది. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు రెండు డబ్బాలను పంపిణీ చేసింది. పారిశుద్ధ సిబ్బంది ట్రాక్టర్‌లో చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి, సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు. చెత్తను రోడ్లపై వేయకుడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ తమ ఇంటి ముందుకు వచ్చిన ట్రాక్టర్‌లో పారబోస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు రోజు వస్తున్నాయా.. లేవా? పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జీపీ కార్యదర్శుల ద్వారా ఎంపీఓలు సమాచారం తెప్పించుకుంటూ పరీక్షిస్తున్నారు. నివేదికలు తయారు చేసి డీఎల్‌పీఓలు, ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి నోటీసులు జారీ చేస్తూ కట్టుదిట్టం చేస్తున్నారు.



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న సిబ్బంది

వీధులన్నీ శుభ్రం..



మా వీధికి పొద్దున్నే చెత్త ట్రాక్టర్ వస్తుంది. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తున్నాం. ఇంతకుముందు ఇలాంటి పరిస్థితులు లేక.. రోడ్డుపైనే చెత్తను పారబోసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటింటికీ చెత్త సేకరిస్తుండడంతో వీధులు పరిశుభ్రంగా ఉన్నాయి.

– గోవిందు, దౌల్తాబాద్

ప్రజల సహకారంతో..



మా గ్రామంలో చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్ అన్ని వీధుల్లో తిరుగుతుంది. మేం పర్యటిస్తూ.. ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటున్నాం. రోడ్డుపై ఎవరైనా చెత్తవేస్తే.. తగిన విధంగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తున్నాం. ప్రస్తుతం ప్రజల సహకారంతో అపరిశుభ్రత అనేది దరిదాపుల్లో లేకుండా చేశాం.

– శిరీష, సర్పంచ్, దౌల్తాబాద్

దశలవారీగా సమస్యల పరిష్కారం

సర్దార్‌నగర్ సర్పంచ్ స్వరూప

షాబాద్: ప్రభుత్వ నిధులతో గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్దార్‌నగర్ సర్పంచ్ మునగపాటి స్వరూప అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలోని పలు కాలనీల్లో యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే రెండేళ్లలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ, ఎంపీపీల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఇందిర, వార్డు సభ్యులు నర్సింలు, కృష్ణ, కలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం తెల్లవారుజామున మున్సిపల్ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు విధినిర్వాహణలో సమయ పాలన పాటించాలని, ఎలాంటి ఇబ్బందులున్నా సమాచారం అందించాలని సూచించారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

సమస్యలు పట్టని అధికారులు

- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి
- సమీక్షలతో ప్రయోజనం శూన్యం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

కుల్కచర్ల: సమస్యలు చెప్పుకుంటూ పోతున్నామే తప్ప.. వాటికి పరిష్కారం మార్గం లభించడం లేదంటూ సంబంధిత అధికారుల తీరుపై మండల సర్పంచులు అసహనం వ్యక్తంచేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడారు. నాలుగేళ్లుగా తమ ఆవేదనలు చెప్పుకుంటున్నా.. అధికారులు ఆలకించడం లేదని, తద్వారా గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయటానికి విద్యుత్శాఖ అధికారులు ఏడాది సమయం తీసుకుంటున్నారని సభదృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ అనుమతి తీసుకోకుండా మీటర్లను ప్రవేటుగా ఏర్పాటు చేసుకుంటున్నారని ఎంపీటీసీ ఆనందం.. విద్యుత్తు సిబ్బంది పనితీరును సభలో ప్రస్తావించారు. ఆబ్కారీశాఖ అవినీతి కారణంగా ఊరుకో మినీ వైన్స్‌లు ఏర్పాటు చేయబడుతున్నాయని, తద్వారా గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయని తిర్మలాపూర్ ఎంపీటీసీ రాంలాల్ ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా పశువైద్య సిబ్బంది అందుబాటులో లేక పశువులు మృత్యువాత పడుతున్నాయని చెప్పారు.



విద్యుత్‌శాఖ అధికారితో మాట్లాడుతున్న చౌడాపూర్ సర్పంచ్ కొత్త రంగారెడ్డి

ఎండుతున్న పంటలు

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువు మరమ్మతులకు నిర్వహించిన పనులు.. ప్రస్తుతం రైతులకు ఇబ్బందికరంగా మారి, పంటలు ఎండుతున్నాయని కామునిపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి, ఎంపీటీసీ చందన, ఎంపీటీసీ ఆనందం సభలో ప్రస్తావించారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, పంచాయతీరాజ్ డీఈ ఉమేష్, ఎంపీడీఓ నాగవేణి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి ‘వెలుగు’ను కాపాడుకోండి

- ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు
- కంటివెలుగు సమీక్షలో అధికారులు, నేతలు
- నేడు ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

మోమిన్‌పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంధత్వ నివారణ, కంటి చూపు పరిరక్షణకై రెండో విడతగా నేటి నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టరు బెజిలిల్ చెప్పారు. బుధవారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఆయన మాట్లాడారు. కంటి పరీక్షలకు సబంధించిన అన్ని పరికరాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేశామని, మోమిన్‌పేట రైతువేదిక, ఏన్కతల జీపీ కార్యాలయంలో జరుపనున్నట్లు ఆయన వెల్లడించారు. రోజుకు 250టోకెన్లు అశా వర్కరుల ద్వారా అందజేశామని, అందులో నుంచి 150మందికి స్క్రీనింగ్ చేస్తామన్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మిగతా వారికి మందులను ఇస్తామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి ఆస్పత్రులకు రిఫర్‌చేస్తామని పేర్కొన్నారు. నిత్యం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కంటి పరీక్షలు జరుపుతామని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

పూడూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి రానున్నారని ఎంపీపీ మల్లేశం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు చన్గోముల్‌లోని రైతు వేదికలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న డాక్టర్ బెజిలిల్

విజయవంతం చేయాలి

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగవేణి అన్నారు. కుల్కచర్ల, బండవెల్కిచర్ల, అంతారం గ్రామాలలో కంటి వెలుగు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమీక్షలో మండల వైద్యాధికారి మాధవి, మహేశ్వరి, ఎంపీఓ ఖరీం, సిహెచ్ఓ చంద్రప్రకాష్, సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

పరీక్షలు చేయించుకోండి

కొడంగల్: ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు ఇస్తారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు ఆనందమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్వాపూర్‌లో..

బంట్వారం: కంటి వెలుగు కార్యక్రమం మద్వాపూర్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ బాలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

‘పల్లెపల్లెకూ కాంగ్రెస్’లో నాయకులు

మర్పల్లి: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ.. రానున్న ఎన్నికల్లో అధికారమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పంచలింగాల, మొగిలిగుండ్ల, మల్లికార్జునగిరి, రామాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ.. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే నేటికీ కనిపిస్తున్నాయని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. పార్టీ అధికారంలోకి వచ్చేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శులు సంజీవరెడ్డి, ప్రభాకర్, బీసీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు నగేష్, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రఫీ, రాచన్న, మధుసూదన్‌రెడ్డి, సురేష్, మండల ఉపాధ్యక్షుడు సలీం, మండల నాయకులు అబ్రహం, మహేష్, గోపాల్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు